

కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం



కోవెలకుంట్ల: భారీ వర్షంతో జలమయమైన ప్రధాన వీధి



బనగానపల్లె: నేలవాలిన వరి పంట



బేతంచెర్లలో కురుస్తున్న వర్షం

భారీ వర్షం.. రైతుకు నష్టం

- పలు ప్రాంతాల్లో అకాల వర్షం
- జలమయమైన వీధులు
- తడిసిన దిగుబడులు

కోవెలకుంట్ల: ఈ ఏడాది వేసవికాలంలో అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఆదివారం ఉదయం ఎండతీవ్రత అధికంగా ఉండి సాయంత్రానికంతా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కోవెలకుంట్ల పట్టణంలోని పలు ప్రధాన వీధులు జలమయమయ్యాయి. గాలులు వీయడంతో గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం వల్ల ఎండ వేడి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించినా రైతులకు నష్టం చేకూర్చింది. నియోజకవర్గంలోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 8,452 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరిలో కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని గుళ్లదూర్తి, కలుగొట్ల, రేవనూరు, లింగాల, వల్లంపాడు, చిన్నకొప్పెర్ల, అమడాల, తదితర గ్రామాల రైతులు వడ్లు, మిరప, మొక్కజొన్న దిగుబడులను కల్లాలు, పొలాల్లో ఆరబోసుకున్నారు. వర్షం కురుస్తుండటంతో దిగుబడులు తడవకుండా పట్టలు కప్పుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. భారీ వర్షం కావడంతో పట్టలు కప్పినా నీరు కిందకు చేరి దిగుబడులు తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొలిమిగుండ్ల ప్రధాన రహదారిలో నిలచిన వర్షపు నీటితో వాహనదారుల అవస్థలు

- **బనగానపల్లె:** మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉరుములు మెరుపులతో కూడిన భారీం కురిసింది. కల్లాల్లో నిల్వ ఉంచిన వరి తడిసిపోయింది. కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నేలవాలింది. అసలు గిట్టుబాటు ధర లేదని ఈ సమయంలో వర్షం తమను నిండా ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పసుపల పరిసర ప్రాంతాల్లో కల్లాల్లోని మొక్కజొన్న తడిచిపోయింది.

- **సంజామల:** ఉరుములతో కూడిన వర్షం రైతన్నకు కష్టంగా మారింది. సంజామల మండలంలో రబీలో వేసిన మొక్కజొన్న, మిరప, వరి తదితర పంటలు నూర్పిడి దశలో ఉన్నాయి. ఆదివారం కురిసిన గాలి వానకు రైతులు ఆందోళన చెందారు. కోత పూర్తి చేసుకున్న కొందరు రైతులు కాల్లాలు, పొలాల్లో ఆరబోసుకున్నారు. అకాల వర్షానికి తడవకుండా పట్టలు కప్పుకునేందుకు పరుగులు తీశారు. ఎగ్గొని గ్రామంలో వరి పంట గాలి వానకు నేలవాలింది. ఒక వైపు పంట దిగుబడి తగ్గిందని బాధ, మరోవైపు అకాల వర్షాలతో కలత చెందుతున్నారు.



సంజామల: ఎగ్గొని గ్రామంలో నేలకొరిగిన వరి

- **కొలిమిగుండ్ల:** మండలంలో ఉరుములు, మెరుపులు, గాలులతో కుండపోత వర్షం కురిసింది. కొలిమిగుండ్ల స్టేట్‌బ్యాంక్ వద్ద ప్రధాన రహదారిపై వర్షపునీరు భారీగా నిలిచిపోయింది. వాహనదారులు అవస్థలు పడ్డారు. మధనంతపురం, అబ్దుల్లాపురం, కొర్నపల్లె తదితరత గ్రామాల్లో పెను గాలులకు అరటిచెట్లు నెలకొరిగాయి. కొద్ది రోజుల్లో గెలలను కోయాల్సిన తరుణంలో అకాల వర్షం పంటను దెబ్బతీసింది. మరికొన్ని గ్రామాల్లో మిరప కోత కోసి ఆరబెట్టుకోగా పూర్తిగా తడిసిపోయింది. భారీగా వీచిన గాలులకు చాలా చోట్లా చెట్లు పడిపోగా రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. దీంతో విద్యుత్‌కు అంతాయం ఏర్పడింది.

- **బేతంచెర్ల:** పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. వాతావరణం చల్లబడింది. ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. పలు గ్రామాల్లో గాలులకు అరకొరగా ఉన్న మామిడి కాయలు రాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆకుమల్లలో మిర్చి దిగుబడులపై కప్పిన పట్టలు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



గాడుబావి వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో ఉన్న గాడుబావి వీరాంజనేయస్వామి, గొరిపేటలోని ఆంజనేయస్వామి, పలక చింతమాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయాల్లో చైత్ర మాస అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళహారతి నిర్వహించారు. అలాగే బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయం, సిమెంట్‌నగర్ గ్రామంలో సుంకులా పరమేశ్వరిదేవి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన ప్రసాద్

కొలిమిగుండ్ల: నాగిరెట్టిపల్లె–హనుమంతుగుండం ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా కమ్మవారిపాలెంకు చెందిన ప్రసాద్ పని నిమిత్తం బైక్‌పై కొలిమిగుండ్ల వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో నాగిరెట్టిపల్లె సమీపానికి చేరుకోగానే బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సాయంతో గాయపడిన అతన్ని 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు రెఫర్ చేయడంతో కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరుకు తరలించారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి దాత రూ.1,00,116 విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు వాస్తవ్యులు కీశే గంజి వెంకటసుబ్బన్న, గంజి ఉమాదేవి కుమారుడు కీశేలు గంజిసుధాకర్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు విరాళాన్ని అందజేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆలయ అర్చకులు దాతలను సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరానికి తరలివచ్చిన జనం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 1200 మందికి గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మం, కిడ్నీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, పెద్దిరెడ్డి మౌలాల్ రెడ్డి పాల్గొన్నారు.

దాడి కేసులో ఏడుగురిపై కేసు

ప్యాపిలి: పట్టణంలోని కుంటగడ్డ వీధిలో నివాసం ఉంటున్న సుధారాణితో పాటు ఆమె కుటుంబ సభ్యులు పుల్లయ్య, శివయ్య, మాధవిపై దాడి చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు. సుధారాణికి ఐదేళ్ల క్రితం గుంతకల్లు మండలం మిట్టమీద దంచెర్ల గ్రామానికి చెందిన కావలి సుధాకర్‌తో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో మూడేళ్ల క్రితం సుధారాణి గుంతకల్లు పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి సుధారాణి ఇంటికి వచ్చిన సుధాకర్ తన బంధువులతో కలసి దాడికి పాల్పడ్డాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కావలి సుధాకర్, నెట్టికల్లు, సురేంద్ర, మురళి, కృష్ణ, భరత్, తేజపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉప సభాపతిని సస్పెండ్ చేయాలి

డోన్ టౌన్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏపీ శాసన సభ ఉప సభాపతి, ఉండి ఎమ్మెల్యే రఘురాం కృష్ణంరాజును వెంటనే సస్పెండ్ చేసి క్షమాపణలు చెప్పించాలని సీపీఎం మండల కార్యదర్శి కొయిలకొండ నాగరాజు, కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, శివరామ్, రామాంజనేయులు, నాగమద్దయ్య, చిన్నరహిమాన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. రఘురామ కృష్ణంరాజు తన నియోజకవర్గంలో దాదాపు వెయ్యి మంది పేదల ఇళ్లను కూలివేసి వారిని రోడ్డున పడేశారన్నారు. సీపీఎం బృందం బాధితులకు పరామర్శించి అండగా నిలిస్తే సహించలేక అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

ప్రశాంతంగా బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష



ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థినులు

డోన్ టౌన్: బీసీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణ సమీపంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మొత్తం 700 మందికి హాజరుకావాల్సి ఉండగా 69 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ వసుంధరదేవి తెలిపారు. కేంద్రాన్ని నంద్యాల జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఓబులేసు తనిఖీ చేశారు. అలాగే మే 4వ తేదీ ఇంటర్‌మీడియెట్ ప్రవేశాల కోసం పరీక్ష జరగనుందని పేర్కొన్నారు.



బేతంచెర్ల ఎంజేపీ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రవేశ పరీక్షకు 177 గైర్హాజరు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఎంజేపీ(మహాత్మ జ్యోతిరావుపూలే) ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆదివారం జరిగిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 819 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గౌడు తెలిపారు. ప్రవేశ పరీక్షకు మొత్తం 996 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 177 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. మే 4వ తేదీ ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆయా ప్రాంతాల నుంచి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు స్కూల్ వద్దకు రావడంతో ఆవరణం కిక్కిరిసిపోయింది.



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బేతంచెర్ల: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ శాంతియుత జీవనం గడపాలని.. గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. పిల్లలు, కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. ఏవైనా సమస్యలు ఉంటే సొంత నిర్ణయాలు తీసుకోకుండా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న వేద బ్రాహ్మణులు

డోన్ టౌన్: కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై కాల్పులు జరిపి అతి కిరాతకంగా హత్య చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని శ్రీవేదమాత బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు శతవధాని గుండ్లూరి దత్తాత్రేయశర్మ, అధ్యక్ష, ఉపాధ్యక్షులు నంద్యాల శంకరశర్మ, శేషావలి శర్మ కోరారు. మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ ఆదివారం రాత్రి పాతబస్టాండ్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రదాడికి ధీటైన సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు సుబ్రమణ్యంశర్మ, గంగాధర్‌శాస్త్రీ, శ్రీనివాస్, బాలసుబ్బయ్య, వీఆర్వో శ్యాంసుందర్, కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఈ–కార్డు’తో వృద్ధాప్యానికి గౌరవం

డోన్: వయోవృద్ధులకు గుర్తింపుగా ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కార్డులు అందజేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ డిజిటల్ కార్డులు పొందవచ్చు. 60 ఏళ్ల నిండిన పురుషులు, 58 ఏళ్ల నిండిన మహిళలకు ఈ కార్డులను జారీ చేస్తున్నారు. వీటిని వినియోగించుకుని వృద్ధులు పలు సేవలను పొందే అవకాశం ఉంది.

కార్డుపై ఏముంటాయంటే..

సీనియర్ సిటిజన్ కార్డుపై బ్లడ్ గ్రూప్, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు పొందుపరుస్తారు. అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు ఆ వివరాలు తోడ్పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పది నిమిషాల్లో జారీ

పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, కుల ధ్రువపత్రం తదితర వివరాలతో సచివాలయాలను సంప్రదించాలి. ఇందుకు రూ.40 రుసుం చెల్లించాలి. ఆధార్ అనుసంధానమైన సిమ్ ఉన్న మొబైల్ తీసుకెళ్లాలి. కార్డు జారీ ప్రక్రియ పది నిమిషాల్లో పూర్తవుతుంది.

వయోవృద్ధులకు సౌకర్యాలు

ఈ కార్డు ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల్లో రాయితీలను సులభంగా పొందవచ్చు. ఇతర గుర్తింపు కార్డుల అవసరం అంతగా ఉండదు. ఆశ్రమాల్లో సేవలు పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఆర్టీసీ బస్సుల్లో 25 శాతం రాయితీ లభిస్తుంది. రైళ్లలో కింది బెర్తులు కేటాయిస్తారు. బ్యాంకింగ్, తపాలా శాఖల్లోని డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ పొందడానికి వీలుంటుంది.కోర్టు కేసుల తేదీల కేటాయింపు, పన్ను మినహాయింపులకు ఉపయోగపడుతుంది.



మే 1 నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్యాపిలి: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మే ఒకటో తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 25 వేలు, ద్వితయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 15 వేలు, తృతీయ, నాలుగో స్థానంలో నిలిచిన జట్లకు వరుసగా రూ. 10 వేలు, రూ.7 వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ప్రవేశ రుసుం రూ. 600 చెల్లించి తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 89191 26822, 77990 99290 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో సోమవారం నుంచి వారం రోజుల పాటు వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్ స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్లకు సంబంధించి విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

శివాలయంలో చోరీ

ప్యాపిలి: మండల పరిధిలోని పోదొడ్డి గ్రామ శివాలయంలో ఆదివారం చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీ తాళాన్ని పగులగొట్టి అందులో ఉన్న నగదును అపహరించారు. హుండీలో రూ. 4 వేలు ఉన్నట్లు సమాచారం. దేవాలయంలోని హుండీలో వేసిన నగదును సైతం దుండగులు చోరీ చేయడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయి

డోన్ టౌన్: రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా లోపించాయని కాంగ్రెస్ పార్టీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గార్లపాటి మద్దిలేటిస్వామి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఉన్నిగోర్ల జనార్దన్ ఆరోపించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ హత్యకు గురికావడమే ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో హత్యలు, నేరాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితుడైన లక్ష్మీనారాయణ ఎదుగుదలను చూసి ఓర్వలేక హత్య చేశారని ఆరోపించారు.

బుగ్గనపై ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి లిక్కర్ కుంభకోణంతో సంబంధం ఉందని టీడీపీ నేత మర్రి రమణ నిరూపిస్తే తాము రాజకీయ సన్యాసం చేస్తామని, నిరూపించకుంటే తన యావదాస్తిని ప్రజలకు చెందేలా రాసివ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. ఆదివారం మాజీ మంత్రి స్వగృహంలో మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి మాట్లాడారు. మర్రి రమణ ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు.

ఉనికి కోసమే అసత్య ఆరోపణలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మర్రి రమణ ఆక్రమణలో ఉన్న లేఅవుట్ స్థలాలను ఆయన కబంధ హస్తాల నుంచి విముక్తి చేయించి ప్రజలకు పార్కులు, రహదారులు ఏర్పాటు చేసిన ఘనత మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీలో తన ఉనికికి ప్రమాదం ఏర్పడిందని గ్రహించే మర్రి రమణ మాజీ మంత్రిపై అసత్య ఆరోపణలు చేయడం బట్ట కాల్చి ఎదుటి వ్యక్తిపై వేయడమేనన్నారు. నిజాయితీపరునిగా పేరుగాంచిన బుగ్గనపై విమర్శలు చేయడం సూర్యునిపై ఉమ్మి వేయడం లాంటిదేనన్నారు. కోట్ల రూపాయల సొంత ధనాన్ని ప్రజా సంక్షేమం కోసం వినియోగించిన చరిత్ర బుగ్గన వంశస్తులదన్నారు.

నాడు కాళ్లు మొక్కి.. నేడు విమర్శలా

గత ప్రభుత్వంలో దొంగచాటుగా వ్యాపారాలు చేసుకునేందుకు, ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను సురక్షితంగా ఉంచుకునేందుకు మాజీ మంత్రి కాళ్లు మొక్కిన వ్యక్తులు నేడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నీతి, నిజాయితీలో బుగ్గన కాలిగోటికి కూడా మర్రి రమణ, గుమ్మకొండ సర్పంచ్ దశరథ రామిరెడ్డి సమానం కారన్నారు.

అభివృద్ధిలో పోటీపడండి

కూటమి నేతలు ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిందిపోయి తప్పుడు ఆరోపణలు, కేసులతో కాలం వెల్లదీస్తున్నారని ధ్వజమెత్తారు. వంద పడకల ప్రభుత్వాస్పత్రిని గత ప్రభుత్వం నిర్మిస్తే వాటిలో నేటి వరకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోయిందన్నారు. పార్టీ నాయకులు కురుకుంద హరి, రైల్వే నాగేంద్ర, మిట్టా రవి, ఆర్ట్ రమణ, కుమ్మరి రాజు, మహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, డీలర్ క్రిష్ణ, శేఖర్ యాదవ్, రవి, వంశీ, కాలేషా, చంద్ర, పెయింటర్ వెంకటేష్, మహేశ్వరరావ్, రబ్బాని పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



మహేష్‌కు నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురం గ్రామానికి చెందిన డి.మహేష్‌బాబు ఇటీవల వెలువడిన 10వ తరగతి ఫలితాల్లో 573 మార్కులు సాధించాడు. గోరుమానుకొండ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి అయిన మహేష్ బాబును ఆదివారం పలువురు అభినందించారు. పారిశ్రామిక వేత్త పోలూరు వెంకటేశ్వర రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, రంగయ్య రూ.15 వేలు అందజేశారు

త్రైత సిద్ధాంత గ్రంథాల ఆవిష్కరణ



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్థానిక ఎల్లమాంబేశ్వరి ఆలయ ఆవరణలో త్రైత సిద్ధాంత గ్రంథాలను హైకోర్టు న్యాయవాది వనమాలి, ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు ఆదివారం ఆవిష్కరించారు. సమాజంలో హిందూ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావాలను పొంపొందిస్తున్న కార్యకర్తల సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పత్తికొండ ఎంపీడీఓ మురళిశ్రీనివాసులు, సామాజిక సేవకులు కాల్వ ఓం నారాయణ పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ గేట్ వద్ద ఎండలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



మండే ఎండలతో నిర్మానుష్యంగా బేతంచెర్ల పాత బస్టాండ్

మండే ఎండ.. కనిపించని నీడ

బేతంచెర్ల: మండే ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రోడ్ల వద్ద ఎండ నుంచి రక్షణ కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేయకపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ ప్రారంభంలోనే ప్రజల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తుండేవారు. ముందు చూపులేని కారణమో మరే కారణం చేతనో చలి వేంద్రాలు ఏర్పాటు చేశారే కాని ఇప్పటి వరకు చలువ పందిళ్లను ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా పాత బస్టాండ్ ప్రాంతం, బనగానపల్లె రైల్వే గేటు వద్ద వాహనదారులు, ప్రయాణికులు ఎండలోనే ఎదురుచూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



గతంలో రైల్వేగేటు వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు (ఫైల్)